క్లుప్తంగా

ఖైదీల కోసం చర్మవ్యాధుల వైద్య శిబిరం



మాట్లాడుతున్న వైద్యులు సుబ్బారావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కారాగారంలో ఖైదీల ఆరోగ్య సంరక్షణ కోసం హేలాపురి చాలెంజర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చర్మ వ్యాదుల వైద్య శిబిరం జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ఆర్వీ స్వామి సహకారంతో బుధవారం ఏర్పాటుచేశారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణుడు డి.సుబ్బారావు నేతృత్వంలో సుమారు 100 మంది ఖైదీలు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ శుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాన్ అఫిషియల్ విజిటర్స్ సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు, లయన్స్ జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు పోలేశ్వరావు, జైలర్లు కె.వెంకటరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పనికి వెళ్లి ప్రమాదానికి గురైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం జీవరత్నం, పి.రామకృష్ణ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20న ఉపాధి హామీ పనికి వెళ్లే వస్తుండగా 16వ నెంబర్ జాతీయ రహదారి భీమడోలు సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఓ ప్రైవేట్ బస్సు ఉపాధి కూలీలు ఉన్న ఆటోని ఢీకొట్టిందని తెలిపారు. ఆటోలో ఉన్న 14 మందికి కూలీలు స్వల్ప, మరో 8 మందికి తీవ్రమైన గాయాలవ్వడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండదండగా ఉండాలని కోరారు. గాయాలపాలై ఇంటి వద్ద ఉన్న కూలీలకు అదనంగా పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురై పనులు కోల్పోయిన వారికి ప్రభుత్వం చట్ట ప్రకారం వేతనం ఇవ్వాలని కోరారు.

రాజీవ్ గాంధీ వర్ధంతి

ఏలూరు (ఆర్ఆర్పేట): భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆద్యుడు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని ఏలూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పెద్దిరెడ్డి సుబ్బారావు, సోమరాజుల శివశంకర్, చక్కా గుప్త, గౌడు రంగబాబు పాల్గొన్నారు.

దుర్భరంగా పెయింటర్ల జీవితాలు

- నెలంతా పనులు ఉండని దుస్థితి
- రోజంతా కష్టపడినా రూ.800 రావడమూ కష్టమే
- సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): పెయింటర్ల జీవితం దుర్భరంగా మారింది. రోజంతా కష్టపడినా రూ.800 ఆదాయం రావడం కష్టంగా మారింది. వలస కూలీల తాకిడి ఎక్కువవడంతో నెలలో సగం రోజులు పనులు దొరకని పరిస్థితి నెలకొంది. ఏలూరు నగరంలో దాదాపు 500 మందికి పైగా పెయింటర్లు ఉన్నారు. ఏలూరు జూట్ మిల్లు మూసివేతతో అక్కడ ఉపాధి కోల్పోయిన పలువురు పెయింటింగ్ వృత్తిలోకి మారారు. దీంతో నగరంలో పెయింటర్స్ సంఖ్య పెరిగింది. వీరందరికీ ప్రతి రోజూ పనులు దొరకని పరిస్థితి. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెయింటర్లతో సహా నిర్మాణరంగ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని నగరంలోని పెయింటర్లు కోరుతున్నారు.



సమస్యల పరిష్కారం కోరుతూ నినాదాలు చేస్తున్న నిర్మాణ రంగ ఏలూరు నాయకులు (ఫైల్)

పెయింటర్ల సమస్యలివీ..

- బిల్డింగ్ తాపీ మేస్త్రీలు, పెయింటింగ్ షాపుల యజమానులు డైరెక్ట్‌గా గృహ యజమానులతో కాంట్రాక్ట్ పనులు తీసుకోవడం వల్ల రోజువారి పెయింటర్లకు పని దొరకడం లేదు.
- పెయింటింగ్ షాప్ యజమానులు బిల్డింగ్ కాంట్రాక్ట్ తీసుకుని ఉత్తర ప్రదేశ్, బీహార్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులను రప్పించి తక్కువ కూలితో పనులు చేయిస్తున్నారు. దీంతో ఏలూరు పెయింటర్లకు పని దొరకడం లేదు.
- జూట్ మిల్లులు మూతపడటం వల్ల కూడా అక్కడ కార్మికులు పెయింటింగ్ పనులపై ఆధారపడుతున్నారు. దీంతో పాత కార్మికులకు పని రోజులు తగ్గాయి.
- పెయింటింగ్ పనులు వేసవి కాలంలోనే ఎక్కువగా చేస్తుంటారు. ఇప్పుడే పెయింటర్లకు పని ఉండడంలేదు. రాబోయే వర్షాకాలంలో కుటుంబాలు ఎలా బతకాలో అని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.
- ఫ్లెక్సీ ప్రింటింగులు ఎక్కువయ్యాక పెయింటింగ్ వేసే ఆర్టిస్టులకు అసలు పని లేకుండా పోయింది. ఆర్టిస్టుల కుటుంబాలకు పస్తులు తప్పడంలేదు.
- ప్రస్తుతం బిల్డర్, పెద్దపెద్ద తాపీ మేస్త్రీలు కాంట్రాక్టు తీసుకోవడం వల్ల భవన నిర్మాణానికి సంబంధించిన అన్ని రకాల పనులు వారే చేసేస్తున్నారు. దీంతో రోజువారి పెయింటర్లకు పపులు ఉండడంలేదు.

అమలుకాని డిప్యూటీ సీఎం హామీ

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో 30 వేల మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. మొత్తం 17 విభాగాల్లో పెయింటర్లు ఒకరుగా గుర్తింపు పొందారు. వీరందరికీ జీవనోపాధికి ఢోకా ఉండకుండా తక్షణం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. తానే మొదటిసారిగా రూ.కోటి విరాళం ఇచ్చి సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ యేడాది కావస్తున్నా పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

అన్‌సీజన్‌లో రెండు రోజులే పని



పెయింటర్‌గా గత పదేళ్ల నుంచి కొనసాగుతున్నాను. వారంలో ఆదివారం సెలవు తీసేస్తే ఆరు రోజులే పని ఉంటుంది. వారానికి కేవలం రూ.4800 ఆదాయం వస్తుంది. అదీ రోజూ పని ఉండే వేసవిలోనే సాధ్యం. మిగతా రోజుల్లో వారానికి రెండు నుంచి మూడు రోజులే పనులు ఉంటాయి.

– పి.కుమార్, పెయింటర్, చేపల తూము సెంటర్, ఏలూరు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



తక్షణం ప్రభుత్వం భవన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి. తద్వారా కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలి. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన పాలకులు అధికారం చేపట్టి ఏడాది అయినా ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గు చేటు.

– పేరాతోట సత్యనారాయణ, పెయింటర్, గిలకలగేటు సెంటర్, ఏలూరు

పనులు దొరకడం లేదు



భవన నిర్మాణ కార్మికులకు వేసవి నాలుగు నెలలూ పనులు దొరికే రోజులు. ప్రస్తుతం వేసవిలోనే పూర్తిస్థాయిలో పనుల్లేవు. వచ్చే వర్షాకాలంలో పరిస్థితి ఏంటనేది ఆలోచిస్తే ఆందోళన కలుగుతుంది. వలస కార్మికులు రాకతో మాకొచ్చే కొద్దిపాటి పనులు కూడా పోతున్నాయి.

– బాణాల శ్రీను, పెయింటర్, ఆదివారపు పేట, ఏలూరు

హామీలు అమలు చేయాలి



ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలి. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరగడంతో భవన నిర్మాణాలు అరకొరగానే సాగుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలూ పెరగడంతో పెయింటర్లు పనుల్లేక అర్ధాకలితో జీవించాల్సి వస్తోంది.

– రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా అధ్యక్షుడు, ఏఐటీయూసీ, ఏలూరు

డ్రెయిన్‌పై శిలాఫలకం ఏర్పాటు తగదు



డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన శిలాఫలకం

ఏలూరు (టూటౌన్): భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామంలో ఇటీవల ప్రారంభించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద డ్రెయినేజీపై శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడం తగదని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలసానిపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు 50 ఏళ్ల కల అని అన్నారు. అయితే గత ఎనిమిదేళ్ల క్రితం దిమ్మ కట్టుకుని అంబేడ్కర్ ఫ్లెక్సీ పెట్టుకుని జయంతి, వర్ధంతుల చేసేవారని తెలిపారు. ఈ నెల 18న అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడ ప్రారంభించామన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా విగ్రహం ప్రారంభోత్సవానికి ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని డ్రెయిన్‌పై ఏర్పాటు చేయడం బాధ కలిగించిందని తెలిపారు. నిర్వాహకులకు ఇది తగదని తక్షణం దాన్ని అక్కడ నుండి తీసి గౌరవ ప్రధమైన స్థానంలో ఉంచాలని సంతోష్ కుమార్ కోరారు.

ఉత్తమ ప్రదర్శనగా 'నా శత్రువు'



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్పేట): అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. విజేతల వివరాలను నిర్వాహకులు బుధవారం పత్రికలకు విడుదల చేశారు. ఉత్తమ ప్రదర్శనగా నా శత్రువు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అమ్మ చెక్కిన బొమ్మ, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా జనరల్ బోగీలు నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ జ్యూరీ ప్రదర్శన 1గా ద్వారబంధాల చంద్రయ్య నాయుడు, ఉత్తమ జ్యూరీ ప్రదర్శన 2గా విడాకులు కావాలి నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా వడ్డాది సత్యనారాయణ, ఉత్తమ రచనగా అమ్మచెక్కిన బొమ్మ ఎంపికయ్యాయి. ఉత్తమ నటుడిగా శ్రీగణేష్, ద్వితీయ ఉత్తమ నటుడిగా ఆర్వీఎల్ నరసింహారావు, ఉత్తమ నటిగా సునయన, ద్వితీయ ఉత్తమ నటిగా ప్రభావతి, ఉత్తమ సహాయ నటిగా జి.వసంత యామిని ఎంపికయ్యారు. వీరితో పాటు 13 విభాగాల్లో బహుతులకు ఆయా కళాకారులను ఎంపిక చేశారు. బహుమతి ప్రదానోత్సవ సభలో అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా, వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి



ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : జిల్లాలో వన సంరక్షణ సమితిలలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్లో ఉన్న వేతన బకాయలు తక్షణం విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం అటవీ శాఖ జిల్లా ఏలూరు రేంజ్ అధికారి కుమార్‌కు సంఘం ఏలూరు జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందజేసింది. లింగపాలెం మండలం తోచిలక రాయుడుపాలెం గ్రామంలో 2020 నుంచి కొత్త ప్లాంటేషన్లు విడుదల చేయాలని, అందులో పేదలకు పని చూపించాలని కోరారు. ఈ మేరకు అటవీ అధికారులను కోరుతున్నా ఫలితం లేదని తెలిపారు. 2023లో 15 హెక్టర్ల జామాయిల్ వీఎస్ఎస్లను కటింగ్ ఆర్డర్ ఇస్తామని అటవి శాఖ అధికారి ప్రజలను నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజన పేదలు అడవిలోకి వెళ్లి తునికాకు కోసి ఎండబెట్టి 40 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి రాష్ట్రం విడిపోయినటి నుంచి నేటికీ తునికాకు బోనస్ బకాయిలు సుమారు రూ.5 కోట్లు విడుదల చేయాలని కోరారు. లింగపాలెం మండలం టీహెచ్ఆర్ పాలెం వీఎస్ఎస్ కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కొత్తపల్లి, కొండలరావు పాలెం వీఎస్ఎస్‌లో పనిచేసిన కూలీలకు నేటికీ వేతనాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఉంగుటూరు మండలం చిన్నఎల్లమిలి, పెద్దఎల్లమల్లి, ఎరమళ్ల చేబ్రోలు గ్రామాల్లో పేదలు వీఎస్ఎస్ఎల్‌లో పనిచేస్తున్నారని వారికి వీఎస్ఎస్‌లో పనిచేసిన కూలీలు వేతన బకాయిలు సుమారు రూ.10 లక్షలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో కటింగ్ చేసిన జామాయిల్ డబ్బులు నేటికీ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి పేదలకు, దళితులకు, గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని వారికి అండగా నిలబడాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	23
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	11
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	12
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	22
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	06
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	36	బీరకాయలు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	20	అల్లం	58
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

డివిజనల్ కమాండర్‌కు సత్కారం



డివిజనల్ కమాండర్‌ను సత్కరిస్తున్న మాజీ సర్పంచ్

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం, లత దంపతులను బుధవారం సానిగూడెం మాజీ సర్పంచ్, సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్ కోర్ మెంబర్ లీనా ప్రశాంతి కుటుంబ సభ్యులు ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. జ్ఞాపకను అందజేశారు.

సీలింగ్ భూములను పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెం ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామంలోని సీపీఎం మండల కార్యదర్శి ఎం జీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన భూ పోరాట కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. గ్రామంలో 200 ఎకరాలకు పైగా ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నట్టు చెప్పారు. కొన్ని సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని భూమిలేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సదరు భూముల్లో సాగులో ఉన్న వారిపై అక్రమకేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు చెందాలని చట్టం చెబుతున్నటప్పటికీ అధికారులు కుమ్మక్కై భూస్వాములకు కట్టబెడుతున్నారని తెలిపారు. భూములు ఆక్రమించుకొని సాగు చేస్తున్న భూస్వాములపై కేసులు నమోదు చేసి, పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, మిగిలిన ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, గ్రామ భూ పోరాట నాయకులు ఎం బాలరాజు, ఎం అశోక్ కుమార్, కె.ఏసు, కె.సుబ్బారావు, ఎం.కుమారి, డి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

25న స్క్రీనింగ్ పరీక్ష

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో ఈనెల 25న రెండో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటలకు నిర్వహించే పరీక్షలో అర్హులైన విద్యార్థులు పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి యోగా దోహదం





యోగా చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి



యోగాలో పాల్గొన్న అధికారులు

ఏలూరు (టూటౌన్): మనిషి ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేందుకు యోగా ఒక్కటే సరైన మార్గమని ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ అన్నారు. జూన్ 21న 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి నెల రోజులు పాటు ప్రతిరోజు యోగా క్లాసులు నిర్వహిస్తూ యోగ యొక్క విశిష్టతపై ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం వేదికగా నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నారని పేర్కొన్నారు. మనిషిలోని అన్ని రకాల రుగ్మతలకు పరిష్కార మార్గం రోజుకు 30 నిమిషాల పాటు యోగా చేయడమేనని తెలిపారు. పెదబాబు, భాను ప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గభవాని యోగాసనాలు చేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువు శివ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, మేనేజర్ మూర్తి, డీఈలు, ఏఈలు, పీఓ మున్సిపల్ కార్పొరేషన్ సంబంధిత అన్ని సెక్షన్ల, అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

26న రజక జన జిల్లా మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజక జన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభ ఈ నెల 26న ఏలూరులోని జన్మభూమి పార్కుకు ఎదురుగా ఉన్న రజక సంఘ భవనంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య తెలిపారు. స్థానిక సంఘ భవనంలో రజక సంఘం ముఖ్య నాయకులు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక గ్రామాల్లో చెరువులు కేటాయించకపోగా, వృత్తిపరమైన ఇబ్బందులు కలుగజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటాయించిన చెరువులకు జీఓలకు వ్యతిరేకంగా ఎక్కువ లీజులు వేయడం, గ్రామాల్లో రజకులకిచ్చిన చెరువును రాజకీయంగా తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని రజకలు వృత్తిపరంగా, సామాజిక పరంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీటన్నింటి పైనా మూడు జిల్లాల ఉన్నతాధికారులను కలిసి ఇప్పటికే వినతి పత్రాలు ఇచ్చామని వివరించారు. అయినా తమకు నేటికీ న్యాయం జరగలేదని తెలిపారు. ఈ నెల 26న ఏలూరులో జరిగే రజక సంఘం మహాసభలో రజకులు సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలవరం ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం: కూటమి పార్టీల ఎన్నికల హామీల్లో భాగంగా పోలవరం ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ టి.సుధాకర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలను కలుపుకుని పోలవరం, రంపచోడవరం, చింతూరు, కేఆర్‌పురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ గిరిజనులు జీవిస్తున్న ప్రాంతంలో ఆదివాసీ చట్టాలు, గిరిజన హక్కుల పరిరక్షణ, గిరిజన ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడాలంటే ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతమంతా ప్రత్యేక పరిపాలనా విభాగంలోకి రావాల్సి ఉందని తెలిపారు.

శ్మశాన భూమి ఆక్రమణలు తొలగించాలి

టి.నరసాపురం: మక్కినవారిగూడెం శ్మశాన భూమి ఆక్రమణలను తొలగించాలని ఎంఆర్పీఎస్ నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. దీనిపై గత నెల 21న పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గ్రామంలోని 1.95 ఎకరాల శ్మశానం భూమి ఉందని, ఇందులో పంచాయతీ సర్పంచ్ ఎం గోపాలరావు కార్యదర్శి కలిసి ఎకరం ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. శ్మశాన స్థలంలో అధికారులు జోక్యం చేసుకుని ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఎంఆర్పీఎస్ నాయకుడు ఆనందరావు డిమాండ్ చేశారు. దీనిపై సర్పంచ్ గోపాలరావును వివరణ కోరగా గత పంచాయతీ హయాంలోనే డంపింగ్ యార్డ్‌కు 50 సెంట్లు కేటాయిస్తూ తీర్మానించారని తెలిపారు. ఇప్పటి వరకు ఆ భూమిని శ్మశానానికి వినియోగించలేదన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ఎంఆర్పీఎస్ నాయకులు ఆనందరావుతోపాటు ఎం ముత్తయ్య, దిరిసినపు విజయ్ తదితరులు ఉన్నారు.